నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, గురువారం 23 మే 2024 HYDERABAD




బంజారాహిల్స్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వేదపండితులు



ఐఐసీటీలో డాక్టర్ ఆర్. చిదంబరంను సన్మానిస్తున్న నిర్వాహకులు

## కన్నులపండువగా..

బంజారాహిల్స్, మే 22 : బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని స్వయంభూ శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీ నరసింహ జయంతి సందర్భంగా బుధవారం స్వామి వారి కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. అంతకుముందు మూలవిరాట్‌కు అభిషేకం చేసి.. శ్రీ నరసింహ హోమం నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి కల్యాణోత్సవం, సాయంత్రం ఉత్సవ మూర్తికి 108 కలశాలతో మహా అభిషేకం చేశారు. కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్యచంద్ర గౌరదాసతో పాటు నగరం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

## కౌంటింగ్‌కు ఏర్పాట్లు

సిటీబ్యూరో, మే 22 (నమస్తే తెలంగాణ) : జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా కౌంటింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్, హైదరాబాద్ రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి బుధవారం అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్ ఆఫీసులో నిర్వహించిన గోషా మహల్ డేటా ఎంట్రీ రిహార్సల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల మార్గదర్శకాలకు అనుగుణంగా కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. 14 టేబుళ్లు ఏర్పాటు చేసి.. కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసు భద్రత ఏర్పాటు చేయాలని చెప్పారు. గుర్తింపు కార్డు ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నోడల్ ఏఆర్‌వో విక్టర్, డిప్యూటీ కలెక్టర్ అండ్ ఏఆర్ఓ విద్యాధర్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## 9 వరకు .. సిల్క్ ఎక్స్‌పో



కవాడిగూడ, మే 22: చేతి వృత్తులను ప్రోత్సహించి వాటిపై ఆధారపడి జీవిస్తున్న వారిని ఆదుకోవాలని అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు కోట దేవకీదేవి కోరారు. ఈ మేరకు బుధవారం ఎన్టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న జాతీయ చేనేత, సిల్క్ ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న జాతీయ చేనేత, సిల్క్ ఎగ్జిబిషన్‌కు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. జూన్ 9వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగుతుందని, చేనేత రంగాన్ని ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. సుమారు 150 స్టాళ్లను ఏర్పాటు చేశామని, వివిధ రకాల చీరలు, క్రాఫ్ట్ ఐటమ్స్, కొండపల్లి బొమ్మలు, పూసలతో తయారు చేసిన జ్యువెల్లరీలు, పిండి వంటలు వంటివి అందుబాటులో ఉన్నాయని కోట దేవకీదేవి తెలిపారు.

## దరఖాస్తుల ఆహ్వానం



సిటీబ్యూరో, మే 22 (నమస్తే తెలంగాణ) : బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద గిరిజన విద్యార్థులకు పాఠశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు హైదరాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జిల్లాకు 41 సీట్లు కేటాయించారని, మూడో తరగతి (20 సీట్లు), ఐదో తరగతి (11) ఎనిమిదో తరగతి (10) కేటాయించినట్లు చెప్పారు. జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. జూన్ 6వతేదీలోపు దరఖాస్తులను లక్డీకాపూల్‌లోని స్నేహ సిల్వర్ జూబ్లీ భవన్‌లో అందించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7780568955, 9849995875 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## 'బిట్స్ పిలానీ'లో వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్స్



జవహర్‌నగర్, మే 22: బిట్స్ పిలానీ క్యాంపస్‌లో వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్స్ ఎంటెక్, ఎంబీఏ, ఎమ్మెస్సీ, బీటెక్‌లో చేరేందుకు అడ్మిషన్స్ ప్రారంభమైనట్లు అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆధునిక వ్యాపారాలు, ఉత్పత్తులు, డిజిటల్ సాంకేతికతలను అందిపుచ్చుకునేందుకు వర్క్ ఇంటిగ్రేటెడ్ కోర్సులు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ నెల 22 నుంచి జూన్ 17 వరకు అడ్మిషన్లు ఉంటాయని, ఆసక్తిగల ప్రొఫెషనల్స్ క్యాంపస్‌లో సంప్రదించాలని సూచించారు.

## హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడిగా కవి యాకుబ్



చిక్కడపల్లి, మే 22: హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కవి యాకుబ్, ఆర్. వాసు ఎన్నికయ్యారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ జనరల్ బాడీ సమావేశాన్ని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు ఉపాధ్యక్షులుగా శోభన్ బాబు, మలుపు బాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా సూరిబాబు, సురేశ్, కోశాధికారిగా నారాయణరెడ్డి ఎన్నికయ్యారు.





## మందు బాటిళ్లన్నీ రోడ్డుపాలు

సికింద్రాబాద్ బోయినపల్లిలో బుధవారం మద్యం లోడుతో వెళ్తున్న లారీ టైరు పంక్చర్ కావడంతో డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. సుమారు రూ.3 లక్షల విలువైన మద్యం సీసాలు ధ్వంసమైనట్లు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉంటే వాహనం అలా బోల్తా కొట్టిందో లేదో.. మద్యం ప్రియులు ఎగపడ్డారు. బాటిళ్లకు బాటిళ్లు పట్టుకెళ్లారు.

# పన్నులే తప్ప.. పనుల్లేవ్

## గ్రేటర్‌లో మౌలిక వసతులపై జీహెచ్‌ఎంసీ శీతకన్ను

### రూ.221.73 కోట్ల విలువైన 756 ఎస్‌ఐజీ పనులు రద్దు

సీసీ రోడ్లు.. డ్రైనేజీ పైపులైన్లు.. మరమ్మతులు నిలిపివేత


ప్రజల సమస్యల పరిష్కారానికి రూపొందించిన పనులన్నీ బంద్

జీహెచ్‌ఎంసీకి ఏటా రూ.3500 కోట్లకు పైగా ఆదాయం

ఇటీవల ఎర్లీబర్డ్ ద్వారా రూ.950 కోట్లు వసూలు

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మే 22 (నమస్తే తెలంగాణ): 'యువర్ ట్యాక్స్ రూపీస్ ఎట్ వర్క్... ఇది నిన్నటి మాట.. 'ఓన్లీ ట్యాక్స్... నో వర్క్స్'... ఇది ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ బాట.. అవును గ్రేటర్‌లో మౌలిక వసతుల కల్పన పట్ల బల్దియా శీతకన్ను చూపిస్తున్నది. ఒక డివిజన్‌లో రహదారుల మరమ్మతులు... ఇంకో డివిజన్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు... మరో డివిజన్‌లో సీసీ రోడ్ల నిర్మాణం... ఇలా సగటు నగరవాసికి మౌలిక వసతులు కల్పించేందుకు రూపొందించిన రూ.221.73 కోట్ల విలువైన ప్రత్యేక మౌలిక వసతుల గ్రాంట్ (ఎస్‌ఐజీ) పనులను తాజాగా రద్దు చేయడమే ఇందుకు నిదర్శనం. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రోనాల్డ్ రాస్ మూడు రోజుల కిందట అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. నిధుల లేమి,... గత ప్రభుత్వ హయాంలో రూపొందించిన పనులే కారణమో..ఉత్తర్వుల్లో మాత్రం స్పష్టత ఇవ్వలేదు. గ్రేటర్‌లోని 150 డివిజన్ల పరిధిలో టెండర్లు పూర్తయి మొదలుకాని, టెండర్ల దశలోని, ప్రతిపాదనలో ఉన్న... ఇలా మూడు రకాలైన 756 పెండింగ్ పనులను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అసలే రానున్నది వర్షాకాలం. ఈ సమయంలో మౌలిక వసతులకు సంబంధించిన ఈ పనులను రద్దు చేయడంతో క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనేది సుస్పష్టం.

### బడ్జెట్ రూ.6,600 కోట్లు..



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్ రూ.6,600 కోట్లు. ఇందులో ప్రధానంగా ప్రజల నుంచి వివిధ రూపాల్లో వచ్చే ఆదాయం రూ.3500-4000 కోట్ల వరకు ఉంటుంది. ఏటా సుమారు రూ.2100 కోట్ల వరకు కేవలం ఆస్తి పన్ను రూపంలోనే గ్రేటర్ ఖజానాకు చేరుతుంది. ఇటీవల ఎర్లీబర్డ్ పథకం ద్వారా రూ. 950 కోట్లు వసూలయ్యాయి. ఇంటి నిర్మాణ అనుమతులు, డెవలప్‌మెంట్ చార్జీలు ఇలా రూ.1200 కోట్ల వరకు వస్తాయి. లీజులు, ఇతరత్రా రూ.300-400 కోట్ల వరకు సమకూరుతాయి. మరి... ప్రజల నుంచి ఇంత భారీస్థాయిలో ఆదాయాన్ని సమకూర్చుకుంటున్న బల్దియా.. నగరంలో ప్రజా మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన వందలాది పనులను ఒకేసారి రద్దు చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

### ఓన్లీ ట్యాక్స్.. నో వర్క్స



### 150 డివిజన్ల పరిధిలో..

వాస్తవానికి ఏ ప్రభుత్వం వచ్చినా... పార్టీలు మారినా... స్థానిక సంస్థలు అందునా జీహెచ్‌ఎంసీకి సంబంధించిన అభివృద్ధి పనులు, విధానాలు అనేవి ప్రజా కోణంలోనే సాధారణంగా జరిగిపోతుంటాయి. రహదారుల మరమ్మతులు, డ్రైనేజీ సంబంధిత పనులు, సీసీ రోడ్ల నిర్మాణం, ఫుట్‌పాత్‌ల నిర్మాణం ఇలా ఇవన్నీ ప్రాథమికంగా జీహెచ్‌ఎంసీ చేపట్టాల్సినవి. ఇందులో భాగంగానే కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రత్యేక మౌలిక వసతుల గ్రాంట్ (ఎస్‌ఐజీ) కింద 150 డివిజన్ల పరిధిలో 756 అభివృద్ధి పనులను రూపొందించారు. కాలానుగుణంగా వీటిలో కొన్ని ప్రతిపాదనలు పూర్తికాగా, మరి కొన్ని టెండర్ల దశలోకి, ఇంకొన్ని టెండర్ల పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. దీంతో తమ ప్రాంతంలో సమస్యల పరిష్కారానికి త్వరలో పనులు జరుగుతాయని నగరవాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు. కానీ ఈ నెల 20న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ 756 పనులను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఇందుకు అనేక కారణాలు ఉన్నాయని అందులో పేర్కొన్నారే తప్ప.. ఫలానా కారణంతో రద్దు చేశామని స్పష్టత ఇవ్వకపోవడం గమనార్హం. దీంతో రద్దు వెనక కారణాలపై అనేక రకాల ప్రచారం జరుగుతున్నది.

### ఖజానాలో కాసులు లేకనా..?

ఈ పనుల రద్దు వెనక ఖజానాలో కాసులు లేకపోవడమే ప్రధాన కారణమని కొందరు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే కాంట్రాక్టర్లకు రూ.1400 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉన్నది. దీంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేసి, సమ్మె చేపట్టారు. తాజాగా రద్దు చేసిన పనుల్లో టెండర్లు పూర్తయినప్పటికీ కాంట్రాక్టర్లు పనులు మొదలుపెట్టే పరిస్థితి కూడా లేదని అధికారి ఒకరు తెలిపారు. అందుకే నిధులలేమితో పనులు రద్దు చేసినట్లు చెబుతున్నారు. అయితే భారీ ప్రాజెక్టు పనులు కొన్నిరోజులు పెండింగ్‌లో ఉన్నా ప్రజా జీవనంపై పెద్ద ప్రభావం ఉండదు. కానీ కాలనీల్లో డ్రైనేజీ, రోడ్లకు సంబంధించిన పనులు పెండింగ్‌లో ఉండటం వల్ల ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఈ క్రమంలో అత్యవసర పనులను పెండింగ్‌లో పెట్టడం మంచిది కాదని పలువురు వాపోతున్నారు. కానీ అధికారులు మొదలుకాని (పెండింగ్) పనులన్నింటినీ ఒకేగాడిన కట్టి రద్దు చేయడంతో ప్రజల సమస్యల పరిష్కారం అటకెక్కినట్లేనని అంటున్నారు.

### కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనివనా..?

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన.. తాలూకు పరిణామాలు అనేకం చోటుచేసుకుంటున్నాయి. అందులో భాగంగానే కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రజల మౌలిక వసతుల కల్పనకు రూపొందించిన ఈ పనులను రద్దు చేసి ఉంటారా? అనే ప్రచారం జరుగుతున్నది. ముఖ్యంగా రేవంత్ సర్కారు కొలువుదీరిన తర్వాత నగరంలో వ్యూహాత్మక నాలా అభివృద్ధి కార్యక్రమం (ఎస్‌ఎన్‌డీపీ), వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్‌ఆర్‌డీపీ) వంటి కీలకమైన ప్రాజెక్టుల పనులు మందగించాయి. అనేక మంది జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు హైదరాబాద్‌ను విశ్వ నగరంగా కీర్తించడంలో ఈ ప్రాజెక్టుల పనులే కీలకంగా మారాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఫ్లై ఓవర్లు, ఆర్‌యూబీలు, ఆర్వోబీల వంటి నిర్మాణ పనుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇదే క్రమంలో తాజాగా మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులు కూడా రద్దు చేయడంతో దీనికి కూడా అదే కారణమా? అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

## అణుపరీక్షలతో గర్వపడిన దేశం

### అటామిక్ ఎనర్జీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ చిదంబరం

ఘనంగా 'స్మైలింగ్ బుద్ధ'

మే 1974 టెస్ట్ అండ్ బియాండ్‌పై ప్రసంగం

ఉస్మానియా యూనివర్సిటీ, మే 22: భారతదేశం తొలిసారిగా నిర్వహించిన అణుపరీక్ష (స్మైలింగ్ బుద్ధ) జరిగి 50 ఏండ్లు పూర్తయిన సందర్భంగా తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (టీఏఎస్), నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ఇండియా (ఎన్ఏఎస్ఐ) లోకల్ చాప్టర్ సంయుక్తాధ్వర్యంలో స్వర్ణోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఐఐసీటీలోని వివేకానంద ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అటామిక్ ఎనర్జీ కమిషన్ మాజీ చైర్మన్, కేంద్ర కేబినెట్ శాస్త్ర సాంకేతిక సలహా కమిటీ మాజీ చైర్మన్, అణు పరీక్షల్లో కీలక పాత్ర పోషించిన పద్మవిభూషణ్ డాక్టర్ ఆర్.చిదంబరం పాల్గొని, 'మే 1974 టెస్ట్ అండ్ బియాండ్' అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలిసారి అణుపరీక్షలను 75 మందితో కూడిన బృందం నిర్వహించిందని చెప్పారు. ఈ బృందంలో తాను కూడా కీలక సభ్యుడిని కావడం గర్వంగా ఉందన్నారు.

### అణుపరీక్ష నిర్వహించిన సమయంలో..

అణుపరీక్ష నిర్వహించిన సమయంలో అక్కడ విడుదలైన శక్తికి ఆ ప్రదేశానికి అతిసమీపంలోని రాళ్లు ఆవిరయ్యాయని, మరికొన్ని రాళ్లు కరిగిపోయాయని, కాస్త దూరంలోని రాళ్లు పైకెగిరి పగిలిపోయాయని చిదంబరం వివరించారు. నాటి అణుపరీక్షలతో దేశం మొత్తం గర్వపడిందని గుర్తు చేశారు. విదేశాల్లో సైతం దేశ కీర్తిప్రతిష్ఠలు పెరిగాయన్నారు. ఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నా..శాస్త్ర సాంకేతిక అంశాలకు అండగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. గౌరవ అతిథిగా న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ కోమల్ కపూర్ హాజరైన ఈ కార్యక్రమంలో టీఏఎస్ అధ్యక్షుడు, సీసీఎంబీ మాజీ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ మోహన్‌రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీఏఎస్ ప్రధాన కార్యదర్శి, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఎస్. సత్యనారాయణ, కోశాధికారి ప్రొఫెసర్ ఎస్ఎం రెడ్డి, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలు డాక్టర్ ఏ. జ్యోతి, యూజీసీ మాజీ సభ్యుడు ప్రొఫెసర్ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు

## తింటే.. కడుపు ఆగమే..

### హోటళ్లు..రెస్టారెంట్లు.. కంపుకంపు

కుళ్లిన ఆహార పదార్థాలు.. పాచిన వంటలు

పేరున్న హోటళ్లలో బయటపడుతున్న డొల్లతనం

తాజాగా కేఎఫ్‌సీ, కృతుంగ, రెస్టో బార్‌లోనూ..

నాణ్యతలేని ఆహారం వెలుగులోకి..

సిటీబ్యూరో: రెస్టారెంట్ ఫుడ్ అంటేనే భయాబ్రాంతులకు గురయ్యే పరిస్థితులు వస్తున్నాయి. బ్రాండెండ్ పేర్లతో జనాలను ఆకట్టుకుంటున్నా... రుచికరమైన ఆహారానికి బదులు.. పాచి, పురుగులు పట్టిన పదార్థాలతో జనాలకు వండి వారిస్తున్నారు. నగరంలోనే పేరున్న రెస్టారెంట్లు కూడా ఇదే తరహాలో కల్తీ, నాణ్యత లేని పదార్థాలతో ఆహారాన్ని వండి జనాల ప్రాణాల మీదకు తీసుకొస్తున్నాయి. గతంలో నగరంలో ఉండే అధ్వాన రెస్టారెంట్ల బాగోతాలను వెలుగులోకి తీసుకొచ్చిన... ఫుడ్ సేఫ్టీ అధికారులు... తాజాగా నిర్వహించిన తనిఖీల్లోనూ కళ్లు బైర్లు కమ్మేలా..కంపు కొట్టే వాసనతో, పురుగులు పట్టిన పదార్థాలను చూసి.. వాంతులు చేసుకునే పరిస్థితి. ఇలా జనాల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నగరంలోని రెస్టారెంట్లలో కేఎఫ్‌సీ, కృతుంగ, రెస్టో బార్ వంటి ఫేజ్ త్రీ హోటల్స్, బార్స్ అండ్ రెస్టారెంట్లు కూడా ఉండటం గమనార్హం.

### రుచి ఉండదు.. శుచీ అసలే పాటించరు..

రుచి ఉండదు. శుచీ అసలే పాటించరు. కానీ పేరుకు మాత్రం లగ్జరీ హోటల్, ఫ్యామిలీ రెస్టారెంట్ అంటున్నా.. వంట గదులు చూస్తే..కడుపులో తిప్పడం ఖాయం. కాగా, గ్రేటర్‌లో ఇటీవల కాలంలో తనిఖీలు ముమ్మరం చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు.. తీరు మార్చుకోని హోటళ్ల నిర్వాహకులపై చర్యలకు దిగుతున్నారు.

### నిత్యం రద్దీగా ఉండే..

సోమాజిగూడలోని కృతుంగ పాలేగార్స్ క్యూజన్, హెడ్ క్వార్టర్ రెస్టో బార్, కేఎఫ్‌సీ రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ, జీహెచ్‌ఎంసీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రెస్టారెంట్లు, హోటళ్లలో వాడుతున్న నాణ్యత లేని, కల్తీ, కుళ్లిన ఆహార పదార్థాలు, వస్తువులను గుర్తించారు. కృతుంగ రెస్టారెంట్‌లో ఎక్స్‌పైరీ డేట్, ఎఫ్ఎస్ఎస్ఐ గుర్తింపు లేని 6 కిలోల పన్నీరు, గడువు ముగిసిన ఆరు కిలోల మేతి మలాయి, నాన్ వెజ్ పేస్ట్, పురుగులు, కీటకాలు, ఎలుకలు, బల్లులు, చెత్తాచెదారం నిండిన వంట గదిని చూసిన అధికారులు విస్తుపోయారు. పేరుకు పెద్ద బార్‌గా గుర్తింపు పొందిన రెస్టో బార్‌లోనూ దొరికిన పిజ్జా బేస్‌లకు ఎలాంటి లేబుల్ లేదనీ, ఇక ఫ్రిజ్‌లో ఉంచిన ఆహార పదార్థాలను కూడా సరైన రీతిలో నిల్వ చేయలేదని గుర్తించారు. ఇలా ఈగలు, బొద్దింకలు, కుళ్లిన ఆహార పదార్థాలతో వంటకాలను చేసి నగరవాసుల ప్రాణాలతో రెస్టారెంట్లు చెలగాటమాడుతున్నాయి.